

## ముప్పిడి ప్రభాకరరావు

నన్ను ఆ యిల్లు ఖాళీ చేయమన్నప్పట్నించీ నాకూ ఆ గదికీ వున్న అనుబంధం మరీ పెరిగిపోయింది. అలాగే ఆ పరిసరాలతో కూడ. పదిరోజుల్లో మరోచోటుకు మారాలి. మరో కొత్త వాతావరణంలో యిమిడిపోవాలి.

నాకూ నా గదికి వున్న అనుబంధం లాంటిదే నాకూ ఆ పరిసరాల్లోని మనుషులకూ మధ్య వుంది. (నే నెప్పుడూ వాళ్ళతో మాటాడకపోయినా—)

నేను మేడమీది పైగదిలో వుంటున్నాను. ఒకే ఒక్క గది. మరీ ఒంటరివాడినై పోవడం వల్ల తరచూ కిటికీవద్దకు వచ్చి కిందికి చూస్తుంటాను. కింద ఎదురుగ పచ్చని మైదానం. దానిచుట్టూ ఎత్తయిన మేడలూ డాబాలు. కార్పొరేషన్‌వాళ్ళు పార్క్‌కని కేటాయించారట ఆ కాస్త స్థలాన్ని. అది వర్షాకాలంలో పెద్ద మడుగులా అవుతుంది. అప్పుడు అందులోని కప్పలు రాత్రిళ్ళు చేసే గోల యింతా అంతా కాదు. తతిమ్మా కాలాల్లోమాత్రం యిబ్బంది లేదు.

ఆ పార్క్‌కని కేటాయించిన స్థలంలో నా గదికి ఎదురుగా చిన్నపాక వుంది. నేను వచ్చినప్పటినుండి అక్కడ దాన్ని చూస్తూనే వున్నాను. వర్షాకాలంలో వచ్చే వరదకు అదెక్కడ కొట్టుకుపోతుందోనని భయం వేసేది.

నేను కిటికీ తెరిస్తే మా యింటి ఓనరు యిల్లు, పక్కన ఆ పూరిపాకా కనిపిస్తాయి. ఏమీ తోచనప్పుడు అటుకేసి చూస్తూ కాలం గడపడం పరిపాటైపోయింది.

ఒంటరి జీవితం ఒక్కోసారి భరించరానిదిగా వుంటుంది. అలాంటప్పుడు రాత్రిళ్ళు గది తలుపులు బార్లాతీసి పడకకుర్చీలోంచి బయటకు చూస్తుంటాను. అక్కడ నాకు ఎదురుగ కనిపించేవి దగ్గరగా పెరిగిన రెండు యూకలిప్టస్ చెట్లుమాత్రమే. నేను మేడమీద ఉండటంవల్ల వాటి మొదళ్ళు నాకు కనిపించవు. వాటి రెమ్మలు ఆకాశానికి తాకుతుంటే నేనుకూడ ఆకాశంలోని వాటి రెమ్మలను చూస్తూ వుండిపోతాను.

నాకెవరూ లేరనేభావం ఒక్కోసారి నన్ను కలచివేస్తుంటుంది. అలాంటప్పుడు గాలికి నిండుగా కదలాడే యీ రెండు చెట్లూ నన్ను ఊరడిస్తున్నట్టు వుంటాయి. వాటిని చూస్తుంటే అదో తృప్తి. ఇద్దరు స్నేహితులు నాముందు మసలుతున్నట్టే వుంటుంది. ఒక్కోసారి అవే నా ప్రాణస్నేహితుల్లా కనిపిస్తాయి.

ఇప్పుడు నన్ను యిల్లు ఖాళీ చేయమన్నారు. నేను నా గదికీ యీ చెట్లకీ సన్నిహితంగా ఏర్పరచుకున్న యింతటి అనుబంధాన్ని అమాంతం ఒక్కసారిగా తెంచేసుకోవాలి. తెంచుకోవడం తప్పనిసరి అని గుర్తొచ్చినప్పుడల్లా ఆ అనుబంధం మరీ ఎక్కువౌతుందేగాని తగ్గడంలేదు.

మనిషికీ-మనిషికీ మధ్య అనుబంధాన్ని మనిషికీ-మరో చెట్టుకో లేక పరిసరానికో మధ్య వుండే అనుబంధంతో పోలిస్తే దాని స్వభావంలో కొంత తేడా వుంటే వుండొచ్చు గాని మనుషులమధ్య అనుబంధాన్నిమాత్రం పూర్తిగా నమ్మలేకుండా వున్నాను.

మా యింటి ఓనరు తల్లిని నేను అవ్వఅని పిలుస్తాను. వాళ్ళ యింట్లో ఓ గదిలో నాల్గేళ్ళపాటు వంటరిగా వున్నాను. ఆతర్వాత వాళ్ళు పక్కస్థలం కొని యిల్లు కట్టారు. కిందిభాగం అద్దెల కిచ్చేశారు. నా కొరకు కూడా మరో గది ఆ మేడమీదనే కట్టి అందులో నన్ను వుండమన్నారు. అద్దెలో ఏమంత తేడా లేదు. నాకూ వాళ్ళకూ ఉన్న ఎటేచ్‌మెంట్ అలాంటిది మరి. నా అంతట నేను వెళ్ళిపోతేనేగాని వాళ్ళకు వాళ్ళుగా నన్ను ఎన్నడూ వెళ్ళమనరట. ఆ గదిలోంచి యీ గదిలోకి మారేటప్పుడు కూడా యీ మాత్రానికే ఎంతోబాధ పడిపోయారు. పిల్లలు పెద్దవాళ్ళవడంవల్ల, యిల్లు చాలకపోవడంవల్ల మరో గదిలోకి పంపుతున్నామన్నారు. ఈ కొత్తయిల్లు మీదిగది కేవలం నా ఒక్కడికోసమే కట్టారట.

ఇల్లా మారి యిక్కడికొచ్చి యిప్పటికి ఆరు మాసాలయినా కాలేదు, యిప్పుడు గది ఖాళీ చేసేయమన్నారు. ఇల్లు మరోచోట ఎక్కడయినా చూసుకోమన్నారు.

ఇప్పుడు నన్ను ఖాళీ చేయమనడానికి కారణం ఏదైనాకానీ, అది నాకు అనవసరం అనిపించింది. అందుకనే నేను మరో యిల్లు చూసుకుని ఖాళీ చేసేయతలచాను.

> పేదదేశాల ప్రజలకు శుభ్రమైన మంచినీరు సరఫరా చేయగలిగితే ప్రపంచంలో వ్యాధులు 80 శాతం తగ్గుతాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిపుణులు తెలుపుతున్నారు. ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు మందికి (120 కోట్ల మందికి) మంచినీటి సౌకర్యం లేదు. 140 కోట్ల మందికి పారిశుధ్య సౌకర్యాలు లేవు.

ఇంతకూ నన్ను ఆ గది ఖాళీ చేయమన్నప్పటినుండీ నేనా కిటికీని తెరవడం మానివేశాను. అది తెరిస్తే వాళ్ళయిల్లు చూడాలి. వాళ్ళ యిల్లు చూడాలంటే నాముఖం చెల్లడం లేదు. కాని ఎన్ని రోజు లని తెరవకుండా ఉండగలను? ఇప్పుడు కిటికీని తెరిస్తే మొదట నేను చూసేది మా ఓనరుయిల్లు కాదు. అది యిప్పుడు నా కంటికికూడా చాలా దూరమైపోయింది. నేనా యింటిని చూసి చాలా రోజులైందంటే ఎవరూ నమ్మరు.

ఏమిటో తెలియదుగాని ఆ కిటికీని తెరవగూడదని నిశ్చయించుకున్నాకే నేనా కిటికీ వద్ద ఎక్కువసేపు గడుపుతున్నాను. ఆ పూరిపాక మరీ సన్నిహితమైపోయింది. అందులోని మనుషులనందరినీ చూశాను. అందరి జీవితాలు ఒకేలా ఉండవనడానికి తార్కాణం ఆ యిల్లు.

ఆ యింట్లో తిరిగే ఓ పధ్నాలుగేళ్ళ అమ్మాయి నాకు తరచూ కనిపించేది. ఆమె ఎప్పుడూ చింపిరి తలతో, మార్చని మురికి గుడ్డలతో నెత్తిమీద ఉప్పరతట్ట పెట్టుకుని చేతిలో గునపమో, పారో, డష్టక్రో తీసుకొని యింటి ముందునుండి వెళ్తూ కనిపించేది. సాధారణంగా ఆ వయసు అమ్మాయిలు నవ్వుతూ గెంతుతూ బడికి వెళ్ళడం చూస్తుంటాము. కాని యీ అమ్మాయిలో

> మన దేశంలోని మొత్తం 351 మంది హైకోర్టు న్యాయ మూర్తులలో మహిళ ఒకే ఒక్కరు. సుప్రీం కోర్టులో ఎవరూ లేరు.

ఒక్కనాడయినా అలాంటి సంతోషం మచ్చుకికూడా కనిపించలేదు. కొందరి జీవితాలు అంతే- తల్లి ఎప్పుడూ దాన్ని తిడుతూనే వుంటుంది. దాని నోరేనోరు. సాయంత్రాలు తండ్రి తాగివస్తాడు. వచ్చి పెళ్ళాన్ని చితకబాదుతాడు. అది వాణ్ణి అడ్డమైన బూతులూ తిడుతుంది. వాడు దాన్ని నేల మీద బడబడ యీడ్చుకుని ఎదరున్న ఏదో యింటికి లాక్కెళ్ళతాడు. వాళ్ళను న్యాయం చెప్పమంటాడు. వాళ్ళు పొందని ఛీదరించుకుంటారు. వాడూరుకోడు. మీ కాళ్ళు మొక్కుతా న్యాయం చెప్పండంటాడు. తలుపులు మూసుకుంటారు. మళ్ళీ ఆమెను చితకబాదుతాడు. అర్ధరాత్రి అవుతుంది. ఇలా ఎన్ని సంవత్సరాల చరిత్రో వాళ్ళది.

ఇప్పుడు పెద్ద కొడుకు కూడా అందొచ్చాడు. వాడూ సమంగా కూలి డబ్బులు సంపాదిస్తున్నాడు. అందుకని యింట్లో వాడి హోదా కూడ సమంగా పెరిగింది. తండ్రే తనతోపాటు కల్లు దుకాణంలో కొడుక్కి ఓ గుక్కెడు పట్టించి మరీ తీసుకొస్తున్నాడు. తాగొచ్చిన తండ్రి రోజూగా పెళ్ళాన్ని కొడుతాడు. కొడుకు "లాపాయింటు" తీస్తాడు. వాడు వీడు తిట్టుకుంటారు. ఆ తర్వాత కర్రలు తీసుకుంటారు. ఓ రోజు యిది కాస్త పాకం ముదిరింది. ముదిరిన మీదట తండ్రి కొడుకు లిద్దరూ తాడి పట్టెలు తీసుకుని బాదుకున్నారు. తాటి ఏసులు దిగి వంటినుండి రక్తాలు కారాయి. ఆ మీదట కోపంతో కొడుకు ముక్కుని కొరికేసాడు. అది ఆవకాయ ముక్క నలిగినట్టు నలిగి నోట్లోకి వచ్చేసింది. దాంతో వాడు లబో దిబో మని గోలెత్తాడు. పోలీస్ కంప్లెయింట్ వెళ్ళింది. కొడుకు దగ్గర్నించి కాదు - మేడల్లోంచి.

న్యూసెన్సు కేసది. లాకప్ నుండి మరుసటి రోజు బయటకు వచ్చారు. పెళ్ళాం మెడలోది పోలిసోళ్ళ చేతిలో పెట్టక తప్పిందికాదు. వాళ్ళు వెళ్ళిపోయాక ఆ పెట్టినదాని కోసం మూడు రోజులు విసుగు విరామం లేకుండా తిట్టింది. శోకాలు పెట్టి ఏడ్చింది. అయితే సంసారాలు యిలా కావడానికి ఎవరు బాధ్యులన్నది ఆలోచిస్తే ఏ వ్యవస్థ మీదికో గాలి దుమారం లేస్తుంది. కాని సంసారమనేది యిలా వుంటే ఎంతైనా ఆ అమ్మాయి లేత గుండెదే కదా - సంతోషమనేది ఎక్కణ్ణించి వస్తుంది.

నే నా రోజు యిల్లు ఖాళీ చేస్తున్నాను; అవ్వ వచ్చింది. ఆమె వచ్చి అంది గదా — ఏనాటి రుణానుబంధమో యిది- నీవు వెళ్ళిపోతుంటే ఏదోలా వుంది. అబ్బాయి దీని మీద కూడ పోర్షన్లు లేపి అద్దెకు యిస్తాడుట. నీదా చిన్న ఉద్యోగం. చిన్న జీతం. పై రాబడి లేని ఆఫీసు. రేపు కట్టిన తర్వాత ఓ పోర్షను యిచ్చినా అంత అద్దె కట్టుకోలేవు గదా - అందుకని తప్పని సరయింది - అంది.

ఆమె సానుభూతి అలాంటిది.

అద్దె కట్టుకునే తాహతు నాకు లేదు మరి.

> ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికి కనుగొన్న బొగ్గు నిల్వలు పది లక్షల కోట్ల టన్నుల దాకా ఉన్నాయి. అందులో ఒక శాతం మనదేశంలో ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ నిల్వలు మన వాడకానికి ఆరు వందలేళ్ళ దాకా సరిపోవచ్చు.

గడించడం గొప్ప కళే - ఆమె కొడుకులా గడించడం నాకు తెలీదు. అంతేకాదు లోకంలో చాలా మందికి గడించడం తెలిసినట్టు నాకు తెలీదు.

కనుక నేను గది ఖాళీ చేసేసాను.

ఇప్పుడు నా గది చుట్టూ మనుష లే- ఇక్కడ కనీసం జాబు వ్రాసుకోడానికి కూడ మనసు పుట్టడం లేదు. అందుకని రాత్రి ఎప్పటికోగాని గదికి రాను. ఎక్కువ సేపు బజారులోను, ఆ తర్వాత సినిమాల్లోను గడిపేస్తున్నాను.

ఎప్పటిలానే బయటకని బయల్దేరాను. రోడ్లన్నీ బిజీగా వున్నాయి. సినిమాకు వెళ్ళాలంటే బుద్ధి పుట్టడం లేదు. పాతిల్లు గుర్తొచ్చింది. ఆలోచనలన్నీ ఆ గది మీద, ఆ చెట్ల మీద నిలిచిపోయాయి. ఓసారి కాదనుకున్న చోటుకు తిరిగి వెళ్ళడం వెలితిగా వుంటుంది నాకు. అయినా కాపురమున్న స్థలాన్ని చూసొస్తే తప్పేముందని మనసును సమాధాన పరచుకున్నాను. కాని యిప్పుడా గది చుట్టు ఎన్ని గదులు లేచాయో-ఆ రెండు చెట్లు అక్కడే వున్నాయని నమ్మకమేమిటి! వాటిని కొట్టేసి ఆ స్థానే ఏ మరుగు దొడ్లయినా కట్టారో ఏమో-

ఆలోచనలు అల్లుకుపోయి అనుమానం మబ్బులా పాకింది.

ఇప్పుడు నేవెళ్ళినా మునుపటి వాతావరణం తిరిగి చూడగలననే ఆశ లేదు. ఆ ఎటేచ్ మెంట్ యిప్పుడు రాదు. అందుకని అక్కడికి వెళ్ళి అందమయిన ఆ చిత్రాన్ని మనసు నుండి మలుపుకోలేను. నాకు తెలుసు

నేను యింకెప్పుడూ అటుకేసి వెళ్ళనని.

జనాన్ని తోసుకుంటూ ముందుకు నడిచాను. నాకు అనుమానం వేసింది. చూపును పక్కకు తిప్పాను అవును. ఆ అమ్మాయే. ఆ పూరిపాకలో వుండే అమ్మాయే-

ఆగాను.

ఆ యిద్దరు కుర్రాళ్ళు ఎవరు ?

జుట్టు బాగానే దువ్వుకుంది. కాగితం పువ్వులాంటి దేదో [illegible]సంది. ఎర్ర జాకెట్టు కింది నించి తెల్లబాడీ రమారమి పూర్తిగా కన్పిస్తోంది. సీత్రూ వోణీ కట్టింది.

ఆ యిద్దరు కుర్రాళ్ళు ఎవరో నాకు తెలీదు గాని వాళ్ళు హోటల్లో సర్వర్లయినా కావచ్చు, టాక్సీ క్లీనర్లయినా కావచ్చు, లేక మరింకెవరైనా కావచ్చు. నా చూపుకి అలా అనిపించింది.

ఆ అమ్మాయి వాళ్ళతో మాటాడుతూ ఎంత ఉత్సాహంగా వుందో వేరే చెప్పనవసరం లేదనే భావిస్తున్నాను. నే చూస్తుండగానే వాళ్ళిద్దరూ రిక్షాను పిలిచి ఎక్కించుకు పోయారు.

నేనిప్పుడేమనుకోవాలి ?

అమాయకమైన ఆ పేద పిల్లని వాళ్ళిద్దరు మోసం చేసి తీసుకుపోయారని ఆమె శీలం గురించి నోరు నెత్తి బాదుకుని గోలపెడుతూ నీతి వాక్యాలు వ్రాయనా ? అలా వ్రాయను.

పోనీ ఆనాడు అవ్వ నామీద చూపిన సానుభూతి లాంటిదే ఈనాడు ఈ అమ్మాయిపట్ల చూపనా ? అవ్వ హృదయం వేరు, నాలుక వేరని ఆనాడే తెలుసు. కనుక లోకాన్ని అలాంటి సానుభూతితో మభ్య పెట్టను.

ఎప్పటికీ నేను చూడలేననుకున్న ఆనందం, ఉత్సాహం నిండైన ఆ నవ్వు నేడా అమ్మాయి ముఖంలో చూడగల్గాను. కొందరి జీవితాలకి మొదలేగాని చివర ఉండదని తెలుసు. అయినా సరే - అంతే చాలు.

ఆమె ఆనందాన్ని నేను కూడా పంచుకోగలుగుతున్నానంటే ఎక్కడో తెలియని ఎటేచ్‌మెంట్ ఉందన్నమాటే. ఆ అమ్మాయి రాత్రంతా సుఖించాలనే కోరుకుంటున్నాను.

ఇప్పుడెందుకో ప్రకృతి చాలా ఆహ్లాదకరంగా వుందనిపిస్తోంది.

ఆకాశం మీది తెలిమబ్బు చంద్రుడి మీదికి పాకింది. ఎక్కణ్ణించో చల్లగాలి వీచింది. తొలకరి కప్ప చేసే శబ్దం ఎప్పటిదో గుర్తొచ్చింది.

నేనిప్పుడు ఎవ్వరూ లేనిచోట ఎక్కడైనా ఒంటరిగా కూర్చోవాలని వుంది. కాని ఈ మహానగరంలో నా కోసం ఎక్కడ ఒంటరితనం మిగిలి వుంటుంది ? *

"రెండు నమస్కరించదగిన విశ్వానారాయణాస్త్రాలు"

— 'శ్రీశ్రీ మార్కు పద్యాలనే వాడుడు' లో శ్రీశ్రీ (1944.)